


# 'అదే' కథలు

## - ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 42

## డబ్బులు దాచుట/పొదుపు

అమెరికన్ యూనివర్సిటీలో సీతారామంకి ఎమ్. ఎస్ లో సీటు రాగానే మొదట చేసిన పని సీటు ఇచ్చిన డిపార్ట్ మెంట్లో ఏదైనా డబ్బులు వచ్చే అవకాశం ఉందా, అనేది చూట్టం. ఏదో మారుమూలన ఉన్న కాన్సాస్ రాష్ట్రంలో ఏదో అంత పెద్ద పేరు లేని యూనివర్సిటీ కనక తెల్సిన విషయం ఏమంటే మొదటి సెమెస్టర్ లో ఎవరికీ డబ్బులు ఇవ్వరు. రెండో సెమెస్టర్ నుంచి ఫీజులు కట్టక్కర్లేదు కానీ మిగతా ఉద్యోగాలవంటివేమీ ఎట్టి పరిస్థితులలోనూ రావు. అంటే తిండి గుడ్డా మెడికల్ ఇన్స్యూరెన్సూ అన్నింటికీ డబ్బులు తనే పెట్టుకోవాలి. ఇండియాలో కొంతమంది వెళ్ళొద్దనీ, మరికొంతమంది వెళ్ళాక డబ్బులు అవే వస్తాయి, వెళ్ళి తీరమనీ ఉచిత సలహాలు పారేసారు. తండ్రీ తల్లీ కూడా వెళ్లమనే చెప్పడం. తమకి ఉన్న బిజినెస్ వల్ల తండ్రి రెండు మూడు సెమెస్టర్లకి డబ్బులు పంపగలడు. చదువు అయిపోగానే అమెరికాలో ఉద్యోగం రాదా? అందులోనూ కంప్యూటర్ ఫీల్డ్ లో ఉద్యోగాలు కోట్లకొద్దీ ఉన్నాయటగా?

పైనా కిందా పడి, మొత్తానికి విమానం ఎక్కేసేడు సీతా ఆర్ వెలగపల్లి. మళ్ళీ అడుగుతారేం, కూడా ఆవకాయ, కందిపొడీ, వగైరా లేకుండా తెలుగువాడు ఎవరండీ అమెరికా వెళ్ళే విమానం ఎక్కేది? కూడా ఓ పదివేల డాలర్లు

పట్టుకొచ్చాడు ఫీజుకీ, ఓ ఆర్నెల్లదాకా గడపడానికీను. అయితే విమానం దిగి ఇండియా అసోసియేషన్ వారి దగ్గిరకి వచ్చేక కానీ మిగతా విషయాలు తెలియలేదు.

ఇల్లు అద్దెకి తీసుకోవాలి. మరో ఇద్దరు కుర్రాళ్ళు కూడా తమకూడా వచ్చినవాళ్లతో కలిసి ఇల్లు తీసుకోబోయేసరికి అద్దెకిచ్చే పెద్దాయన చెప్పేడు – మనిషికి 300 చొప్పున డిపాజిట్ కట్టాలిట. అదేమిటి ఆమధ్య డిపాజిట్ లేకుండా అద్దెకి ఇచ్చేవారుగా అంటే అప్పుడు చెప్పారు – నిజమే కానీ అపార్ట్ మెంట్ పాడుచేస్తున్నారు కుర్రాళ్ళూ, కుర్రమ్మలూను. అందుకే కొత్తగా ఇలా పెట్టారు. రైటో, ఇంక తప్పదు కదా, అలా అనుకోని అవాంతరం 300 మింగాక మరో రెండు మూడు అవాంతరాలొచ్చేయి – హెల్త్ ఇన్స్యూరెన్స్ ఆరునెలలకి 700, ఇంటికి గ్యాసు కంపెనీకి మళ్ళీ ఓ డిపాజిట్ తలో వందా, అలా దాదాపు రెండువేలు వదిలిపోయాయి. ఎంత ఏడ్చినా కట్టక తప్పనివి కనక ఆ డబ్బులు ఇచ్చుకోవల్సిందే. ఫీజు కట్టి కాలేజీలో క్లాసులు మొదలుపెట్టేసరికి సరిగ్గా తన దగ్గిర డబ్బులు లెక్కపెట్టుకుంటే మిగిలినవి రెండువేల ఐదొందలు. తానొచ్చినది ఆగస్టులో. వచ్చే సెమెస్టర్ లో డబ్బులు ఇస్తారు అనుకుంటే, జనవరీ ఫిబ్రవరి దాకా చేతికి పైసా రాదు. అంటే ఆరునెల దాకా గడపాలి వీటితో. తగ్గించుకునే ఖర్చు తిండీ, బట్టా కొనడం ఆపడం. లేదా రెండో సెమెస్టర్ కి మళ్ళీ ఇంటికి చెప్పి డబ్బులు తెప్పించుకోవడం. ఇంటి అద్దే, వంటకి వాడే గ్యాసుకీ ఇటువంటివాటిలో డబ్బులు దాద్దామన్నా కుదరదు గాక కుదరదు కనక మర్నాటినుంచీ సీతా అమల్లో పెట్టిన విషయం – పొద్దున్నే ఫలహారం అక్కర్లేదు. మధ్యాహ్నం వీలుంటే కాసిని మిగిలిపోయిన అన్నం మెతుకులు ఆవకాయతో లాగించవచ్చు. రాత్రికి భోయనం ఉండనే ఉంది.

దీంట్లో మరో తిరకాసు వచ్చింది. మధ్యాహ్నం భోజనం మానేస్తే రాత్రి రెండు దోసులు ఎక్కువ తినడం అలవాటైంది. అదీ పెరుగూ, అప్పుడో గుడ్డూ, ఓ చికెనూ, కొన్ని ప్రత్యేకమైన కాయగూరల్తో – అంటే మీకు తెలియన్దేవుంది, కాబేజీ, కాలీఫ్లవర్, అలా దొరికినవాటితో. ఇండియన్ స్టోర్ కి వెళ్తే వంకాయలూ బెండకాయలూ దొరుకుతాయి కానీ ఒక్కోటీ మనం కొనలేని వెలలతో మూడేసి డాలర్లు అమ్ముతున్నారు పౌండ్ బరువుకి వెధవలు. ఈ బిజినెస్ మనుషులున్నారు చూసారూ, వాళ్ళకి లాభం తప్ప జనం ఉన్నారా, పోయారా, అనేది మరేం పట్టదు. ఓ నెల చూసాక బాగానే గడపగల్గినా నెలాఖరుకి మొత్తం చూసుకుంటే ఆరువందలైంది. లెక్కలో మర్చిపోయిన విషయాల్లో ఫోను బిల్లూ, ఇంటర్నెట్ ఛార్జీలు, అప్పుడొకటీ ఇప్పుడొకటీ కొన్న డో నట్ పాకెట్లూ, ఇంట్లోకి కావాల్సిన టాయ్ లెట్ పేపర్ వగైరా. ఇలా అయితే నాలుగు నెలల్లో తన డబ్బులు ఖాళీ. సీతా రూమ్మేట్లని కూర్చోబెట్టి చెప్పేసేడు – నేను రేపట్నుంచీ అన్నం, కూరలూ, పెరుగూ తప్ప మరోటి తినను. డబ్బులు ఇచ్చుకోలేను. ఎప్పుడైనా మీరు గుడ్లూ చికెనూ అదీ కొనుక్కుంటే నాకు బిల్లు వేయకండి. సీరియల్స్ అవీ నేను తినను. సీతారామం రూమ్మేట్ ఏదో సర్ది చెప్పబోయేడు కానీ సీతా ఖరాఖండిగా కుదరదని చెప్పేడు. సరే, వాళ్లకేం? మర్నాటినుండీ సీతా గారు తన కొత్త రూల్స్ పాటించడం మొదలుపెట్టాడు. ఈ పది

రోజులు బాగానే గడిచింది. తర్వాత మోహం మొత్తడం మొదలౌతుంటే, మొండిగా అదే అలవాటౌతుందిలే అనుకుంటూ అలాగే కొనసాగించాడు.

మూడో నెలలో సీతా రూమ్మేట్ కి ఎవరో ఫోన్ చేసారు అపార్ట్ మెంట్ కి. సీతారామం డిపార్ట్ మెంట్లో కళ్ళు తిరిగి పడిపోయాట్ట. వాళ్ళు ఎమర్జన్సీకి ఫోన్ చేసి చెప్తే హాస్పిటల్లో చేర్చారు. మీకు వీలుంటే వెళ్ళి చూడండి. ఆ రూమ్మేట్ మూడో రూమ్మేట్ కి చెప్పాడీ విషయం. ఆ మూడో ఆయన అన్నాడు విసురుగా – అన్నం తినడం మానేసాడుగా, అనుభవించమనండి, మనకేం? ఇద్దరూ కాసేపు నవ్వుకున్నా చివరకి ఊరుకుంటే మానవత్వం కాదు కనక ఇండియా అసోసియేషన్ వారికి చెప్పి ఎవరిదో కారులో హాస్పిటల్ కి వెళ్ళారు. నీరసంగా కళ్ళు మూసుకుని ఉన్న సీతా, చేతిలో వైర్లూ, ముక్కులో మరో పైపూ అవీ ఉన్నాయి. సెలైన్ డ్రిప్ పెట్టారు. నర్సమ్మ గారు వచ్చి చెప్పారు – నిలకడగానే ఉన్నాడు కానీ మరో రెండు రోజులు ఉండాలేమో?

మరో గంటకి డాక్టర్ వచ్చి చెప్పాడు అసలు సంగతి – వంట్లో బ్లడ్ కౌంట్ తేడాగా ఉంది. ఫలానా ఫలానావి ఎక్కువగా ఉంటే ట్రైగ్లిసరైడ్స్ అనేవి ఆకాశంలో 300 కి పైన ఉన్నాయి. అన్నీ విన[లే]ని సీతారాం పడుకునే ఉన్నాడు, తమ మాటలు వినడని తెలిసాక రూమ్మేట్ చెప్పేడు, "గత రెండు నెలల బట్టీ డైట్ పాటిస్తున్నాడు. కాయగూరల్లో దుంపలు తప్ప ఏమీ తినడు. బ్రేక్ ఫాస్ట్ చేయడు, అన్నం పెరుగూ ఒకటే తినేది; అదీ ఆవకాయతోగానీ మరో ఊరగాయతోగానీ. రోజూ ఫుల్ ఫాట్ ఉన్న గడ్డపెరుగు తింటే ట్రైగ్లిసరైడ్స్ అవకాశం ఉందా?

ఎందుకలా తింటున్నాడో అర్థంకాని డాక్టర్ అడిగాడు, "ఈ కుర్రాడు లావుగా బరువు తప్పనిసరిగా తగ్గించుకోవాల్సినవాడుగా లేడే? ఎందుకలా డైటింగ్ చేస్తున్నాడు?" డాక్టర్ దగ్గిర అబద్ధాలు పనికిరావు కనక రూమ్మేట్ అసలు విషయం చెప్పాడు – డబ్బుల సంగతీ, దాచడం గురించీ, మరో రెండు మూడు నెలలదాకా ఎలా అనే బెంగ గురించీ. ఆశ్చర్యపోవడం డాక్టర్ వంతు అయింది.

చివరకి మరో రెండు రోజులు హాస్పిటల్లో ఉండి ఇంటికి వెళ్లడానికి అనుమతి ఇచ్చారు. అదృష్టం ఏమిటంటే ముందు ఆరునెలలకి కొన్న మెడికల్ ఇన్స్యూరెన్స్ అక్కరకి వచ్చింది ఇప్పుడు లేకపోతే తలమీద గుద్దే సీతాకి. ఇంటికి వెళ్ళేముందు డాక్టర్ కూర్చోపెట్టి కొన్ని విషయాలు చెప్పాడు సీతారాం, వాళ్ల రూమ్మేట్లతో.

డబ్బులు లేవని తిండి మానితే మనిషికి ఉన్న ఆరోగ్యం పాడౌతుంది కదా. అందువల్ల డబ్బులకి వేరే ప్రయత్నాలు చేయండి. మరీ అంత కష్టం గా ఉంటే ఇదిగో ఈ చర్చ్ దగ్గిరకి వెళ్లండి వారానికోసారి వాళ్ళు కొన్ని సరుకులు ఇస్తారు కావాల్సిన వాళ్లకి. వాళ్ళు ఏయే సరుకులు ఇస్తారు, అవి మీకెంత ఉపయోగం అనేవి నాకు తెలియవు, ఫోన్ చేసి కనుక్కోండి. యూనివర్సిటీ చదువు అంటే అమెరికాలో తల్లి తండ్రులు పిల్లలు పుట్టినప్పట్నుండీ దాస్తారు డబ్బులు. అందువల్ల ఇలా డబ్బుల్లేకుండా అమెరికా రావడం అంత మంచి పనికాదు. తీరా వచ్చేసారు కనక చర్చ్ ని అడగండి లేదా

మీ ఇండియన్స్ ఎవరైనా ఉంటే వాళ్లనీ అడిగి చూడండి. మీరు జీవితంలో ఏదైనా చేయాలని అనుకుంటే ముందు మీరు బతికి ఆరోగ్యంగా ఉండడం ముఖ్యం. లేకపోతే ఇలా హస్పిటళ్ల చుట్టూ తిరగాలి. అప్పుడు మరిన్ని డబ్బులు వదుల్తాయి. ఈ సారికి నేను ఒక్కణ్ణీ మీకు ట్రీట్మెంట్ ఇవ్వగలిగాను. కానీ మరోసారి ఇద్దరు ముగ్గురు స్పెషలిస్ట్ ల దగ్గిరకి వెళ్ళాల్సి వస్తే ఏం చేస్తారు? ఇవి గుర్తుపెట్టుకుని ఉండండి. గుడ్ లక్.

ఈ తలవాచే తిట్లతో బయటకి వచ్చాక వెనకసీట్లో కూర్చున్న సీతా కి ముందు సీట్లో కూర్చున్న రూమ్మేట్ చెప్పేడు – "నేను మొదట చెప్పాను విన్నావా? అప్పుడు నేను చెప్పిన విషయమే ఇప్పుడు తెల్ల కోటు వేసుకున్న డాక్టర్ చెప్పేడు. అనుభవించు లేదా, అందరితో బాటు, మేము ఏం చేస్తున్నామో అదే చేయ్."

పాఠకుడా రూమ్మేట్ సీతారాం తో మొదట ఏమని చెప్పాడు? ఇంకా అర్థం కాకపోతే కింద నీతి చదువుడు.

నీతిః డబ్బులు దాచడానికి తిండి మానేస్తే కాసిని డబ్బులు మిగుల్తాయేమో కానీ మీరు మిగల్రు.

Post your comments